# వీడియో పెళ్ళి

పూర్వం, అంటే యాభైలలోనూ అరవైలలోనూ, కొన్ని తెలుగు సినిమాల్లో ఒకే రకమైన సన్నివేశం తరచుగా కనిపిస్తూ వుండేది. నాగేశ్వర్రావో, రామారావో, హరనాథో, పెళ్ళికొడుకులు. సావిత్రి, జమునలాటి వాళ్ళు పెళ్ళికూతుళ్ళు. వేద మంత్రాలతో, మంగళ వాయిద్యాలతో పెళ్ళి ఘనంగా జరుగుతుంటుంది.

అప్పుడే వస్తాడు సి.యస్.ఆర్. లేదా నాగభూషణం లేదా ముక్కామల. కొండొకచో సూర్యకాంతం కూడాను. హీరో హీరోయిన్‌కి మంగళసూత్రం కడుతుంటాడు. రసాలూరు రాజేశ్వరావుగారో, ఘంటసాలగారో, పెండ్యాలగారో మంగళ వాయిద్యాల సౌండ్, సౌండ్ ఇంజనీర్ వల్లభజోస్యుల శివరాంగారి సహాయంతో, ఎక్కువ చేస్తారు.

వచ్చిన విలన్, ఆ సినిమా ఏదయినా సరే, అప్పుడు చెప్పేది మూడక్షరాల ఒకే ఒక డైలాగు. 'ఆపండి' అని. (అది విని పెళ్ళికూతురి తండ్రి - పెరుమాళ్ళో, నాగయ్యో, గుమ్మడో - గుండె పట్టుకుని అలా అలా కూలిపోవటం వుంటుంది కానీ, ఈ వ్యాసానికి అది అనవసరం). ఈ ఆపండి అనే మాట, కట్నం తక్కువ యిన కారణంగా కావచ్చు, కట్నం ఇవ్వనందుకు కావచ్చు, ఇతర కారణాలేవైనా కావచ్చు. కానీ ఆ ఒక్క మాట, సాఫీగా నడుస్తున్న కథని కంచికి పోకుండా కష్ట పెట్టేంతగా వుండేది ఆ రోజుల్లో. ఇలాటి సంఘటనలు సినిమాల్లోనే కాక, దురదృష్టవశాత్తూ నిజ జీవితంలోనూ జరిగేవి.

0 0 0

గత ఏడేళ్ళల్లో ఇండియాలో మూడు పెళ్ళిళ్ళు చూశాను. సినిమా పెళ్ళిళ్ళు కాదు, నిజమైన పెళ్ళిళ్ళు. అంతకు ముందు పెళ్ళిళ్ళకీ, ఇప్పటి ఈ పెళ్ళిళ్ళకీ ఒక తేడా వుంది. ఒకటేమిటిలెండి చాలా తేడాలున్నాయి.

ఆనాడు షామియాల క్రింద జరిగేవి, ఈనాడు పెద్ద పెద్ద కల్యాణ మండపాల్లో జరుగుతున్నాయి. ఎండు మిరపకాయలు కొని మా ఇంట్లో కారం కొట్టిస్తుంటే, మా ఇంట్లోనే కాక మా వూళ్ళో కూడా అందరూ తుమ్ముతూ, కళ్ళల్లో ఆనంద భాష్పాలు రాల్చేవాళ్ళు. పసుపు కొమ్ములు తెచ్చి, పసుపు కొట్టిస్తుంటే అందరి చొక్కాల మీదా పసుపు రంగు పులుముకుని, మా రోడ్డంతా పచ్చగా కళకళ లాడుతూ వుండేది. ఈనాడు కాటరింగులు వచ్చేశాయి మరి. అయినా ఆ పాత రోజుల మమకారంతో, కారం బదులు రోడ్డు మీద దుమ్ము కళ్ళల్లో నీళ్ళు

తెప్పిస్తున్నది. పురోహితుడు ఎక్కడయినా ఒక మంత్రం చెప్పకపోతే, మళ్ళీ మొత్తం రీవైండ్ చేయించి ఇంకోసారి మళ్ళీ చెప్పమనేవాళ్ళు ఆనాడు. ఇప్పుడు వి.సి.ఆర్.లో లాగా షార్ట్ ప్లే, లాంగ్ ప్లే, ఎక్స్‌టెండెడ్ ప్లే వచ్చేశాయి. ముందే పురోహితుడితో పెళ్ళి 'ఎంత సేపు' చేయాలో చెబితే, అంతసేపట్లో అవగొట్టేస్తాడు.

అలాగే కట్నాలు తగ్గి గిట్నాలు వచ్చాయి. ఇంతకు ముందు కట్నం పాతిక వేలూ, పెళ్ళికి యాభై వేలూ అయేవి. ఇప్పుడు పెళ్ళికొడుకులు ఆదర్శ యువకులు కనుక, కట్నం తీసుకోవటం లేదు. కాకపోతే పెళ్ళి ఘనంగా చేయమంటున్నారు. ఎంత ఘనమంటే తలకు మించినంత. ఆకాశమంత కల్యాణమండపంలో పెళ్ళి. ఇటు తెలుగు పట్టుబట్టలూ, అటు ఉత్తరీయాల బదులు ఉత్తర భారత షేర్వాణీలూ అమెరికాకి కావలసిన బిజినెస్ సూటులూ. చేతికి ఉంగరాలే కాక, పెళ్ళి కొడుకుకి మధ్యే మధ్యే ఒలెంపిక్ గోల్డ్ మెడల్‌లాగా మెడలో గొలుసు. మనిషికి నూటాభై రూపాయల ప్లేటు మీల్ వగైరాలతో తడిపి మోపెడ్ కాదు, తడవకుండా టొయోటా కారూ... సదరు మొత్తం రెండంకెల లకారాలతో జరుగుతున్నాయి. ఎంత మార్పు. కన్యాశుల్కంనించీ కట్నాలూ, ఇప్పుడు గిట్నాలు. మరి అల్లుడి అమెరికా టిక్కెట్టు సరేసరి. ప్లేట్ మీల్ అంటే గుర్తొచ్చింది. నాకిష్టమైన లడ్డూలు కనపడలేదక్కడ. రసమలై, వెనీలా ఐస్ క్రీం.

ఎనీ వే.... యు గాట్ ది పాయింట్.

నేను వెళ్ళిన ఒక పెళ్ళిలో మంగళ సూత్రం కట్టే సీను. మా శీను లేచి మంగళసూత్రం కట్టబోతున్నాడు. పెళ్ళి కూతురు బాపూ హీరోయిన్‌లా తన పెద్ద పెద్ద కళ్ళు అందంగా ఒక్కసారి పైకెత్తి, అతను తన శీనే అని నిర్ధారణ చేసుకుంది కాబోలు, సిగ్గు పడుతూ కళ్ళు క్రిందకి దించుకుని చిరునవ్వులు చిందిస్తూ మరొక్క సారి సిగ్గుపడింది. శీను కూడా ఆ అందమైన సీనుకి అబ్బురపడి, ఆనందపడుతూ మంగళసూత్రం కడుతున్నాడు. ఒక ముడి వేశాడు. మంగళ వాయిద్యాల స్థాయి పెరిగింది. హఠాత్తుగా 'ఆపండి' అనే డైలాగు వినపడింది.

ఇదేమిటి ఇది ఆనాటి తెలుగు సినిమా కాదు, గిట్నాలే కానీ కట్నాల గొడవ లేనే లేదు, మరి ఈ డైలాగేమిటి అనుకుని హాశ్చర్యపడుతూ ఇటూ అటూ చూశాను. డైలాగు సరిగ్గానే వినపడింది కానీ, చెప్పినవాడు విలనాగ్రేసుడు కాదు. ఎంతో డబ్బు ఇచ్చి మనమే పెట్టుకున్న విడియోగ్రాఫరుడు. అతని ఉద్దేశ్యం నిజంగా పెళ్ళి ఆపటం కాదు. ఆ పటం తీయటం. అంటే మన తెలుగులో, పెళ్ళి విడియో తీయటం.

నేనూ నా విడియో కెమేరా పట్టుకుని అక్కడే తీస్తున్నాను కనుక, బాగా దగ్గరనించీ వీడియోగ్రాఫర్ల వ్యవహారం చూసే అవకాశం కలిగింది.

అతను పెళ్ళికొడుకుతో అంటున్నాడు - 'బాబూ. నువ్వు అడ్డం వస్తున్నావయ్యా! కొంచెం పక్కకి తిరిగి, కెమేరా వేపు చూస్తూ తాళి కట్టు' అన్నాడు. పెళ్ళికొడుకు శీను బిత్తరపోయి, అతను చెప్పినట్టే నుంచున్నాడు.

'ఇప్పుడు బాగుంది. తాళి కట్టు బాబూ' అన్నాడు విడియోగ్రాఫర్. అతనే

ఆ పెళ్ళికి దర్శకత్వం మరి. పెళ్ళికొడుకు ఇంకో రెండు ముళ్ళు వేశాడు.

'విడియోలో మొదటిది రాలేదు. రెండే వచ్చాయి. ఇంకో ముడి వేయి' అన్నాడు విడియోగ్రాఫర్.

'మూడు ముళ్ళూ వేశాడు' అన్నాడు పురోహితుడు.

'అవును వేశాను' అన్నాడు శీను అప్రమత్తంగా, పెళ్ళికూతురి విశాల నేత్రాలకు మత్తుగా మురిసిపోతూ.

'విడియోలో రెండే వచ్చాయని చెప్పానా? ఇంకో ముడి వెయ్యి' అన్నాడు దర్శక ఫొటోగ్రాఫర్.

'నాలుగు ముళ్ళు వెయ్యొచ్చా?' అనుమానం వచ్చింది పెళ్ళికొడుక్కి.

'ఫర్వాలేదు ఒకటి ఎక్కువే వేస్తున్నావుకదా! వెయ్యి. మీ ఆవిడ మాంగల్యం ఇంకొంచెం గట్టిగా వుంటుంది' అంది వెనకనే నుంచున్న పక్కింటి మందపాటి పిన్నిగారు.

ఇలా వ్రాసుకుంటూ పోతే చాల వుంది. నాకు నచ్చనిది ఇంకోటుంది. మన కెమెరామన్‌కి పక్కన, ఇంకో లైటింగు రంగారావు. ఆయన పక్క ఇంకో ఇద్దరు స్టిల్ ఫొటోగ్రాఫర్లు. ఆ నలుగురూ వారి వారి వైర్లతో సహా చైనావారి మహాగోడలా అడ్డంగా నుంచుని, సకుటుంబ సపరివార సమేతంగా వచ్చి పెళ్ళి చూద్దామని ఉబలాటపడే వారికి ఆ ఉబలాటం తీరకుండా యధాశక్తి శ్రమ పడుతుంటారు.

ఆ విడియోగ్రాఫలుంగారికి నేను చెప్పాను - 'అయ్యా! అంత దగ్గరగా అడ్డగోడలా నుంచుని మీరు ఇబ్బంది పడటమే కాక, వధూవరులని ఆశీర్వదించి మదర్పిత చందన తాంబూలాదులు తీసుకోటానికి వచ్చిన వారిని ఇబ్బంది పెట్టనక్కరలేదు. ఇలా చూడండి నా కెమెరాలో జూం బటన్ అని ఒకటి వుంది. అలాగే మీ కెమేరాలోనూ వుంది. అన్ని జూములకూ ఇది అనృతాంజనం. కొంచెం అడ్డం తొలిగి దూరంగా నుంచుని, ఆ జూం బటన్ వాడి, వాడి పెళ్ళి చూడలేక వాడి చూపులు చూస్తున్న ఆహ్వానితులకు ఒక వేడి సదవకాశం కల్పించకూడదూ!' అన్నాను.

వాళ్ళు నన్ను వీడెవడ్రా బాబూ ఎక్కడినించో వచ్చి ఈ భూమ్మీద మా హక్కులని ప్రశ్నిస్తున్నాడని అనుకుంటూ, తమ చైనావారి మహాగోడ విడియో కార్యక్రమం యధాప్రకారం కొనసాగించారు. విడియో దర్శకుల హోదాలో, పురోహితుల వారికి పెళ్ళి ఎలా చేయాలో, ఎప్పుడు ఏది చేయాలో చెప్పి చక్కటి విడియో తయారు చేశారు.

'పెళ్ళి కొన్ని గంటలు మాత్రమే జరిగే తతంగం. ఇట్టే అయిపోతుంది. విడియో టేపయితే ఎన్నో సంవత్సరాలు వుంటుంది. దాన్నే వి.సి.డి.లా చేస్తే జీవితాంతం వుంటుంది. డీ.వీ.డీ.లా చేస్తే కొన్ని తరాలో, యుగాలో వుంటుంది. ఏది ముఖ్యం?' అన్నాడు నా ముఖంలో మటమటలు చూసి, ఒక దూరపు చుట్టం.

ఎంత నిజం! ముందుచూపు లేనివాడిని. నాకు తట్టలేదు సుమా!

0 0 0